నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

ముషీరాబాద్, నవంబర్ 24: టీఎస్ఎస్‌పీడీసీఎల్ ఆజామాబాద్ డివిజన్ 11కేవీ గోల్కొండ ఎక్స్‌రోడ్, స్పెన్సర్, దయార మార్కెట్, శాస్త్రీనగర్ ఫీడర్ల పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతు కారణంగా సోమవారం(నేడు) విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఆజామాబాద్ డివిజన్ ఏడీఈ జి.నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి 1.30 గంటల వరకు గోల్కొండ ఎక్స్ రోడ్, స్పెన్సర్ ఫీడర్ పరిధిలోని ఎక్ మీనార్ మసీదు, క్రిష్ణ కాలనీ, శివాలయం టెంపుల్, ముషీరాబాద్ పోలీసుస్టేషన్, రాజా డిలక్స్, రేస్ కోర్సు, చర్చి గల్లీ, ఎన్‌బీకే ఎస్టేట్ పరిసరాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తారు. మధ్యాహ్నం 2.30 నుంచి 5గంటల వరకు దయార మార్కెట్ ఫీడర్ల పధిలోని రిసాల, సాగర్‌లాల్ ఆసుపత్రి, దయార మార్కెట్, హరినగర్ పరిసరాప్రాంతాల్లో కరెంట్ సరఫరా ఉండదు. మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5గంటల వరకు శాస్త్రీనగర్ ఫీడర్ పరిధిలోని మోహన్ నగర్, శాస్త్రీనగర్, జెమినీకాలనీ, రాంనగర్, సెయింట్ పాయిస్ హైస్కూల్ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదు.

పట్టాలపై గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య

మారేడ్‌పల్లి, నవంబర్ 24: రైలు పట్టాలపై గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన సికింద్రాబాద్ రైల్వే పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. రైల్వే పోలీసుల వివరాల ప్రకారం సికింద్రాబాద్-లాలాగూడ రైల్వే స్టేషన్ల మధ్య ఓ వ్యక్తి లింగంపల్లి నుంచి తిరుపతికి వెళ్లే నారాయణాద్రి ఎక్స్‌ప్రెస్ రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. మృతుడి వయసు సుమారు 50-55 ఏండ్లు ఉంటాయని, ఒంటిపై గులాబీ రంగు తెల్లని గీతల చొక్కా, నలుపు రంగు ఫ్యాంట్ ధరించి ఉన్నట్టు పోలీసులు వెల్లడించారు. మృతుడి ఎడమ చేతికి ఆరు వేళ్లు ఉన్నాయి. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి సంబంధికులు సికింద్రాబాద్ రైల్వే పోలీసు స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.

ఘనంగా మహాపడి పూజ

- హాజరైన ఎమ్మెల్యేలు తలసాని, ముఠా

పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్



అయ్యప్ప మహాపడి పూజలో పాల్గొన్న ఎమ్మెల్యేలు ముఠా గోపాల్, తలసాని శ్రీనివాస్‌యాదవ్

చిక్కడపల్లి, నవంబర్ 24: బీఆర్ఎస్ కవాడిగూడ డివిజన్ అధ్యక్షుడు వల్లాల శ్యామ్‌యాదవ్ ఆధ్వర్యంలో కవాడిగూ నిర్వహించిన అయ్యప్ప స్వామి మహాపడి పూజను ఘనంగా నిర్వహించారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్, ఎమ్మెల్యే ముఠా గోపాల్, బీఆర్ఎస్ యువజన విభాగం నాయకుడు ముఠా జయసింహ హాజరై స్వామి వారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు వల్లాల శ్రీనివాస్‌యాదవ్, రవియాదవ్, ఈశ్వర్, బీఆర్ఎస్ నాయకుడు రాకేశ్‌కుమార్, శంకర్‌ముదిరాజ్, వై.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సెకండ్ బజార్‌లో

మారేడ్‌పల్లి: మోండా డివిజన్ సెకండ్ బజార్‌లో ఆదివారం డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు ఆకుల హరికృష్ణ, మాజీ కార్పొరేటర్ ఆకుల రూప దంపతుల ఆధ్వర్యంలో నిర్వహించిన అయ్యప్ప స్వామి మహా పడి పూజకు ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ హాజరయ్యారు. పూజల అనంతరం ఎమ్మెల్యేను సన్మానించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఎమ్మెల్యే వెంట బీఆర్ఎస్ నాయకులు మహేశ్‌యాదవ్, జయరాజ్ తదితరులు ఉన్నారు.

అన్యాయం చేస్తున్న ప్రభుత్వం

బన్సీలాల్‌పేట్, నవంబర్ 24: మాదిగలకు ప్రభుత్వం తీరని అన్యాయం చేస్తున్నదని బీఆర్ఎస్ నాయకుడు కె.లక్ష్మిపతి అన్నారు. ఆదివారం బన్సీలాల్‌పేట్‌లో మాదిగ హక్కుల పోరాట సంఘం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. సంఘం సలహాదారుడు లక్ష్మిపతి మాట్లాడుతూ మూడు దశాబ్దాల పాటు పోరాడి సాధించుకున్న వర్గీకరణను కావాలని జాప్యం చేస్తున్నారని అన్నారు. ఉద్యోగ నియామకాలను చేపట్టి మాదిగలకు అన్యాయం చేస్తున్నా, అధికార పార్టీలో ఉన్న ఎమ్మెల్యేలు, ఎంపీలు, ప్రజాప్రతినిధులు ఎందుకు మాట్లాడడం లేదని ఆయన ప్రశ్నించారు. రాబోయే రోజుల్లో మాదిగల సత్తా చూపించి, ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతామని ఆయన అన్నారు. సమావేశంలో కన్వీనర్ కుర్మ బలరాం, నాయకులు ఏసూరి శ్రీనివాస్, గోవర్ధన్, శివ, లక్ష్మినారాయణ, మహేశ్, శంకర్, మధు, రాజు, చిన్నా, సత్తి, దేవి, సంతోశ్ పాల్గొన్నారు.

బన్సీలాల్‌పేట్ సమావేశంలో పాల్గొన్న మాదిగ హక్కుల పోరాట సంఘం నాయకులు

సత్వరమే సమస్యల పరిష్కారం

ఎమ్మెల్యే ముఠా గోపాల్‌ను సత్కరిస్తున్న చర్చి కమిటీ సభ్యులు

ముషీరాబాద్, నవంబర్ 24: తమ దృష్టికి వచ్చిన సమస్యలు వెంటనే పరిష్కరించేదుకు తగిన చర్యలు తీకుంటున్నట్టు ఎమ్మెల్యే ముఠా గోపాల్ తెలిపారు. రాంనగర్ వెస్లీ చర్చి వద్ద డ్రైనేజీ సమస్యను పరిష్కరించినందుకు ఆదివారం చర్చి కమిటీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుటున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ముఠా జయసింహ, శంకర్‌ముదిరాజ్, వెంకటేశ్, శ్రీధర్ రెడ్డి, చర్చి కమిటీ ప్రతినిధులు థామ్సన్, జయరావు, సామ్యూల్, ఎస్ఐ సిమన్, సునీల్, మాణిక్‌రావు, దివాకర్, తదితరులు పాల్గొన్నారు.

బ్రాహ్మణ విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు

త్రిదండి దేవనాథ రామానుజ స్వామి, ఎమ్మెల్యే తలసాని చేతుల మీదుగా ల్యాప్‌టాప్‌లు అందుకుంటున్న విద్యార్థులు

అమీర్‌పేట్, నవంబర్ 24: తెలంగాణ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య ఆధ్వర్యంలో ఆదివారం సనత్‌నగర్ హనుమాన్ దేవస్థాన ప్రాంగణంలో కార్తీక వన సమారాధన ఘనంగా జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరై కార్తీక వన సమారాధన నిర్వహించారు. సమాఖ్య అధ్యక్షుడు వెల్లాల రాంమోహన్ నేతృత్వంలో జరిగిన వేడుకల్లో పేద బ్రాహ్మణ విద్యార్థులు 120 మందికి ల్యాప్‌ట్యాప్‌లు, 1 నుంచి 10వ తరగతిలోపు చదువుతున్న విద్యార్థులకు ఆర్థిక సహాయం కింద చెక్కులను త్రిదండి దేవనాథ రామానుజ స్వామితో కలిసి సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్, ఎమ్మెల్సీ వాణీదేవి, మాజీ ఎమ్మెల్సీ రామచంద్రరావు, బూర్గుల శ్యాంసుందర్‌గౌడ్ అందజేశారు. ఆలయ ప్రాంగణంలో వన భోజనాల్లో బ్రాహ్మణ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను బీఆర్ఎస్ యువ నాయకుడు ముఠా జయసింహ కలిశారు. ఈ సందర్భంగా ముఠా జయసింహ మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి ప్రతి నాయకుడు, కార్యకర్త కృషి చేయాలని ఎమ్మెల్సీ కవిత సూచించారని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు రాకేశ్‌కుమార్ పాల్గొన్నారు. – చిక్కడపల్లి

స్కైఫౌండేషన్ ఆధ్వర్యంలో అన్నదానం

బన్సీలాల్‌పేట్, నవంబర్ 24: నగరంలో ఫుట్‌పాత్‌లపై ఉంటున్న వృద్ధులను, నిరాశ్రయులను, దివ్యాంగులకు భోజనం సమకూర్చామని పద్మారావునగర్‌లోని స్కై ఫౌండేషన్ అధ్యక్షుడు డాక్టర్ వై.సంజీవ్‌కుమార్, ఉపాధ్యక్షురాలు ఓ.పావని తెలిపారు. 265వ ఆదివారం నిర్వహించిన అన్నదానంలో సంస్థ సభ్యులు అఖిల్, ఇర్ఫాన్, సాయితేజ, హరీశ్, నేహా పాల్గొన్నారు.

స్కందగిరి ఆలయంలో ధర్మపురం స్వామిజీ

పీఠాధిపతికి స్వాగతం పలికిన స్కందగిరి ఆలయ ప్రతినిధులు

బన్సీలాల్‌పేట్, నవంబర్ 24: తమిళనాడులోని ధర్మపురం స్వామిజీ ఆదివారం పద్మారావునగర్‌లోని స్కందగిరి సుబ్రమణ్య స్వామి ఆలయానికి వచ్చారు. స్వామిజీని ఆలయ కమిటీ ప్రతినిధులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. రెండురోజుల పాటు ఆయన స్కందగిరి క్షేత్రంలో బస చేస్తారని కమిటీ చైర్మన్ కృష్ణన్ రాజమణి తెలిపారు. వందలాది మంది భక్తులకు స్వామిజీని ఆశిర్వచనం అందించారని, సోమవారం స్వామిజీ కోటి దీపోత్సవానికి హాజరవుతారని వారు తెలిపారు.

అక్రమ నిర్మాణాన్ని అడ్డుకోవాలని వినతి



రోడ్డు ఎఫెక్టెడ్ ఏరియాలో చేపడుతున్న నిర్మాణం

ముషీరాబాద్, నవంబర్ 24: రాంనగర్ రామాలయ వీధిలో ఓ ఇంటి నిర్మాణదారుడు రోడ్ సెట్‌బ్యాక్ ఏరియాలో అక్రమంగా చేపడుతున్న నిర్మాణంపై చర్యలు తీసుకోవాలని స్థానికులు అధికారులను కోరారు. రాంనగర్ రామాలయం వెనుక వీధిలో 1-9-115/2 రోడ్డు అక్రమించి నిర్మాణం చేపడుతున్నట్టు తెలిపారు. ఇదివరకే ఇంటి నిర్మాణం పూర్తిచేసిన సదరు వ్యక్తి, రోడ్ ఎఫెక్టెడ్ ఎరియాలో నిర్మాణం చేపడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. దీంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుందని, రోడ్డు ఇరుకుగా మారుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదివరకు సదరు నిర్మాణంపై సర్కిల్-15 అధికారులకు ఫిర్యాదు చేస్తే నిలిపివేశారని, రెండేండ్ల తరువాత మళ్లీ నిర్మాణం చేడుతున్నారని తెలిపారు.

ఉద్యమకారులకు ప్రభుత్వం న్యాయం చేయాలి

మల్కాజిగిరి, నవంబర్ 24: ఉద్యమకారులకు ప్రభుత్వం న్యాయం చేయాలని ఉద్యమకారుల ఫోరం చైర్మన్ శ్రీనివాసరావు విజ్ఞప్తి చేశారు. ఆదివారం మచ్చ బొల్లారం సంజీవరెడ్డి ఫంక్షన్ హాల్‌లో తెలంగాణ ఉద్యమకారుల సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ శ్రీనివాస రావు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన విధంగా ఉద్యమకారులకు ప్రత్యేక బోర్డును ఏర్పాటుచేసి ఒక్కొక్కరికి 250గజాల స్థలాన్ని కేటాయించాలని అన్నారు.ఈ కార్యక్రమంలో ఫోరం ప్రధాన కార్యదర్శి సురేందర్ రెడ్డి, కృష్ణ, రవీందర్, పరశురాంరెడ్డి, అంజయ్య, వెంకన్న, మురుగేష్, ఉదయ్, శోభన్‌బాబు, సంతోష్, సుధీర్, మల్లేష్, ఖలీల్, నర్సింగ్, సతీష్, వెంకటేశ్, వెంకటేష్‌యాదవ్, రాజేష్, శ్యామల, సులోచన తదితరులు పాల్గొన్నారు.

రేపు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ

సికింద్రాబాద్, నవంబర్ 24: రేపు మధురానగర్ కమ్యూనిటీ హాల్ ప్రాంగణంలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను సికింద్రాబాద్ ఎమ్మెల్యే తీగుల్ల పద్మారావుగౌడ్ పంపిణీ చేస్తారని ఆయన కార్యాలయ అధికారులు ఆదివారం ఒక పక్రటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 11 గంటలకు పంపిణీ చేస్తారని, లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమానికి నాయకులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

ఏఎంఆర్ పట్ల అప్రమత్తత పెరగాలి

అమీర్‌పేట్, నవంబర్ 24: యాంటీ బయోటిక్స్ వల్ల తలెత్తే యాంటీ మైక్రోబయల్ రెసిస్టెన్స్ (ఏఎంఆర్) అనేక ఇన్ఫెక్షన్లకు దారి తీస్తాయని, అందుకే ఏఎంఆర్ పట్ల ప్రతి ఒకరు అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందని ఆస్టర్ ప్రైమ్ ఆసుపత్రి మైక్రో బయాలజిస్ట్ డాక్టర్ ఆర్సీ బిలోరియా పేర్కొన్నారు. ప్రపంచ యాంటీ మైక్రోబయల్ అవగాహన వారోత్సవాన్ని పురస్కరించుకుని అమీర్‌పేట్‌లోని ఆస్టర్ ప్రైమ్‌లో ఈనెల 18 నుంచి జరుగుతున్న అవగాహన కార్యక్రమాల ముగింపు సమావేశానికి ఆమె హాజరయ్యారు. ప్రపంచంలో 10 అతి పెద్ద ఆరోగ్య ముప్పుల్లో ఒకటిగా ఏఎంఆర్‌ను ప్రపంచ ఆరోగ్య సంస గుర్తించిందని అన్నారు. 1990 నుంచి ప్రతియేటా దాదాపు 10లక్షల మంది ఏఎంఆర్ బారిన పడి మృత్యువాత పడుతున్నారన్నారు. 2050 నాటికి 4 కోట్ల మంది ఇన్‌ఫెక్షన్లు సోకే ప్రమాదముందని గ్లోబల్ రీసెర్చ్ ఆన్ యాంటీ మైక్రోబయల్ రెసిస్టెన్స్ పరిశోధనలో తేలిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇష్టారాజ్యంగా యాంటీ బయాటిక్స్ వాడకాన్ని తగ్గించాలని సూచించారు.

కార్లు ఢీకొని ఇద్దరికి గాయాలు

కీసర, నవంబర్ 24:ఆగి ఉన్న కారును మరో కారు ఢీకొట్టిన ఘటన కీసర పోలీసుస్టేషన్ పరిధిలో జరిగింది. కీసరలోని శ్రీ రాఘవేంద్ర హోటల్ ముందు కారు ఆగింది. మరో కారు స్పీడ్‌గా వచ్చి ఆగి ఉన్న కారు ఢీకొట్టింది. నిర్లక్ష్యంగా స్విఫ్ట్ కారును నడిపిన డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. వారిని దవాఖానకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొన్నారు.

ప్రమాదకరంగా మ్యాన్ హోల్స్

- ప్రమాదాల బారిన పడుతున్న వాహనదారులు, పాదచారులు
- దినదిన గండంగా మారిన సమస్యలు
- ఇకనైనా అధికారులు మరమతులు చేపట్టాలని స్థానికుల వేడుకోలు

సీతారాంనగర్‌లోని రామాలయం ముందు మ్యాన్ హోల్‌లో ఇరుక్కపోయిన గ్యాస్ సిలిండర్ల వాహనం

సికింద్రాబాద్, నవంబర్ 24: సీతాఫల్‌మండి డివిజన్ పరిధిలో మ్యాన్ హోల్స్ ప్రమాదకరంగా మారాయి. దీంతో వాహనదారులు, పాదచారులు ప్రమాదాలకు గురవుతున్నారు. అయినా పట్టించుకునే నాథుడే కరవయ్యాడు. స్థానికులు ఈవిషయంపై జీహెచ్ఎంసీ అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోతుందని వాపోతున్నారు. గతనెల రోజుల నుంచి పరిస్థితి అలానే ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇక చేసేది ఏమీ లేక స్థానికులే మ్యాన్ హోల్‌లకు మరమతులు చేసుకుంటున్నారు. వాటి వల్ల ప్రమాదాలు జరుగకుండా పూల కుండీలను, కట్టెలను అడ్డుగా

వారాసిగూడలో ప్రమాదకరంగా ఉన్న మ్యాన్ హోల్

పెడుతున్నారు. అయినా స్థానికులకు ప్రమాదాలు గండం తప్పట్లేదు. సీతాఫల్‌మండి రామాలయం వద్ద మ్యాన్ హోల్ పైకప్పు ప్రమాదకరంగా మారింది. దీంతో గత బుధవారం గ్యాస్ ఎజెన్సీకి చెందిన వ్యాన్ సిలిండర్లు ఇంటింటికీ డెలివరీ చేసేందుకు వెళ్తుండగా ప్రమాదవశాత్తు అందులో ఇరుక్కుంది. వ్యాన్ డ్రైవర్ అప్రమత్తంగా ఉండటంతో పెను ప్రమాదం తప్పింది. అటు వైపు వెళ్తున్న వాహనదారులు, నామాలగుండు వీరాంజనేయ స్వామి ఆలయ కమిటీ సభ్యుడు బేతాళ నరేశ్ ఈ విషయంపై జీహెచ్ఎంసీ అధికారులకు ఫిర్యాదు చేశాడు. ఇక రాత్రిపూట మ్యాన్ హోల్ గుంతలు కనిపించక పోవడంతో వాహనదారులు ప్రమాదాల పడుతున్నారు. వారాసిగూడ సెయింట్ జాన్స్ స్కూల్ ముందు రోడ్డుపై ఉన్న మ్యాన్ హోల్ పైమూత అందులో పడి ప్రమాదకరంగా మారింది. స్కూల్ ముందు విద్యార్థులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటుండగా ఆమ్యాన్ హోల్‌కు మరమతులు చేపట్టినట్టు స్కూల్ ప్రన్సిపాల్ అంకం శ్రీకాంత్ తెలిపారు. అటు వైపు ఎవ్వరు వెళ్లకుండా పూల మొక్క కుండీని అడ్డుగా పెట్టారు. వారాసిగూడలో కౌసర్ మసీదుకు వెళ్లే దారిలో మ్యాన్ హోల్ ప్రమాదకంగా మారింది. దీంతో స్థానికులు పొడువు కట్టెను అడ్డుగా పెట్టారు. అయినా వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు మ్యాన్ హోళ్లను గుర్తించి వాటికి మరమతులు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

హైదరాబాద్ శారీ ఫెస్టివల్ ప్రారంభం

అమీర్‌పేట్, నవంబర్ 24: అమీర్‌పేట్‌లోని కమ్మసంఘంలో హైదరాబాద్ శారీ ఫెస్టివల్ ఆదివారం ప్రారంభమైంది. ప్రముఖ చేనేత నిపుణుడు ప్రతిష్టాత్మక సంత్ కబీర్ అవార్డు గ్రహీత పద్మశ్రీ గజం అంజయ్య ప్రారంభించగా, జాతీయ చేనేత బ్రాండ్ అంబాసిడర్ రష్మీ ఠాకూర్ గౌరవ అతిథిగా హాజరయ్యారు. భారత ప్రభుత్వ టెక్స్‌టైల్స్ మంత్రిత్వ శాఖ డెవలప్‌మెంట్ కమిషనర్ (చేనేత వస్త్రాలు) సహకారంతో నేషనల్ డిజైన్ సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. నవంబర్ 30 వరకు ఉదయం 10గంటల నుంచి రాత్రి 8వరకు ప్రదర్శన కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు. హైదరాబాద్‌లోని వీవర్స్ సర్వీస్ సెంటర్ డాక్టర్ ఎస్.అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

విద్యార్థిని అదృశ్యం

సజిత(ఫైల్)

ఘట్‌కేసర్, నవంబర్ 24: పోచారం పోలీస్టేషన్‌లో పరిధిలో విద్యార్థిని అదృశ్యమైన ఘటన ఆదివారం జరిగింది.పోలీసుల కథనం ప్రకారం.. షేక్ సజిత(19) ఈనెల 19న తప్పిపోయింది. యం నంపేట్ లోని శ్రీనిధి ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ చదువుతున్నది.యువతి తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

ప్రొస్టేట్, వృషణ క్యాన్సర్లతో అప్రమత్తంగా ఉండాలి

మాదాపూర్, నవంబర్ 24: ప్రొస్టేట్, వృషణ క్యాన్సర్లు పెద్ద వయసు వారికి వచ్చే అవకాశాలు అధికంగా ఉన్నాయని ఏఐఎన్‌యూ చీఫ్ కన్సల్టెంట్ యూరాలజిస్ట్, ఏషియన్ దవాఖాన ఎండీ డాక్టర్ మల్లికార్జున్ అన్నారు. మాదాపూర్‌లోని ఏఐఎన్‌యూ(ఏషియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ నెఫ్రాలజీ అండ్ యూరాలజీ) దవాఖానాలో ఆదివారం పురుషుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని ఆదివారం ఎంఓ వాక్ 2024 పేరుతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వాక్‌ను ఏఐఎన్‌యూ సీఈఓ సందీప్ గూడూరు, వైద్య నిపుణులతో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ మల్లికార్జున్ మాట్లాడుతూ.. పురుషులు సకాలంలో స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవాలన్నారు. 15 నుంచి 35 సంవత్సరాల వయసు పురుషులకు ఈ వ్యాధి వచ్చే అవకాశాలు ఉన్నాయన్నారు. తరచూ మూత్ర విసర్జన, మూత్రంలో రక్తం పడటం, వృషణ పరిమాణంలో మార్పులాంటి సంకేతాలు కనిపిస్తుంటాయని, ఈ లక్షణాలను గుర్తించి స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవాలన్నారు. రోఓటిక్ శస్త్ర చికిత్సలు, మిని మల్లీ ఇన్వేజివ్ విధానాల్లో ప్రొస్టేట్ ఆరోగ్యాన్ని కాపాడటం సులభతరం చేస్తుందన్నారు. వాక్‌లో 400 మంది ఔత్సాహికులు పాల్గొన్నారు.

ఎంఓ వాక్ 2024 కార్యక్రమంలో భాగంగా ప్రొస్టేట్, వృషణ సమస్యలపై అవగాహన కల్పిస్తున్న ఏఐఎన్‌యూ వైద్య బృందం